క్లుప్తంగా

భోజనం ప్యాకెట్ల వితరణ

సీతానగరం: చినకొండేపూడిలోని షిర్డీ సాయి బాబా వసతి మందిరం ఆధ్వర్యంలో దాతల సహకారంతో గురువారం నిరుపేదలకు భోజనం ప్యాకెట్లు అందించారు. నరసాపురానికి చెందిన జిళ్లెళ్ల ఈశ్వర పంతులు జ్ఞాపకార్థం 150 మందికి వితరణ చేశారు.

జాబ్‌మేళాలో 121 మందికి ఉద్యోగాలు



ఉద్యోగ నియామక పత్రం అందిస్తున్న ప్రిన్సిపాల్ చిట్టిబాబు

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన జాబ్ మేళాలో 121 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. జేకేసీ, వికాస, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టిబాబు ప్రారంభించారు. ఐసస్, ఎక్సాస్, టాటా, హ్యుందాయ్ తదితర పది కంపెనీల ప్రతినిధులు, వికాస ప్రతినిధి పవన్ ఆధ్వర్యంలో 200 మందికి ఇంటర్వ్యూలు చేశారు. ఎంపికైన వారికి నియామక పత్రాలను అందించారు.

బాలిక అదృశ్యం

మధురపూడి: కోరుకొండ మండలం కణుపూరు గ్రామానికి చెందిన బాలిక అదృశ్యమైనట్టు కోరుకొండ ఎస్సై శ్యామ్ సుందర్ తెలిపారు. ఇంటర్మీడియట్ చదువుతున్న బాలిక గురువారం ఇంటి నుంచి కాలేజీకి వెళ్లింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో పోలీసులకు ఆమె తండ్రి ఫిర్యాదు చేశారు.

పశువైద్య సేవలను వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న పశు సంవర్ధకశాఖ అనపర్తి ఏడీ శ్రీనివాసరావు

బిక్కవోలు: పశువైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని పశు సంవర్ధక శాఖ అనపర్తి ఏడీ డాక్టర్ వై శ్రీనివాసరావు కోరారు. గురువారం మండలంలోని గంగులూరి పాకలు గ్రామంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు నట్టల నివారణ, సన్న జీవాల టీకాలు, గర్భకోశ వ్యాధులకు చికిత్స అందించారు. పాడి రైతులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు ప్రణీత్, రవికుమార్, వీర్రాజు, సిబ్బందితో పాటు పాడి రైతులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఎరువులు



ఎరువుల గోడౌన్‌ను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలో రైతులకు కావాల్సిన ఎరువులను అందుబాటులో ఉంచినట్టు జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు అన్నారు. తొర్రేడు పీఏసీఎస్ (సొసైటీ) ఎరువుల గోడౌన్‌ను గురువారం ఆయన తనిఖీ చేశారు. అలాగే సొసైటీలోని ఎరువుల రిజిస్టర్‌ను పరిశీలించారు. ఆయన వెంట వ్యవసాయశాఖ ఏడీఏ శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ అధికారి భీమరాజు పాల్గొన్నారు.

ఏలోహి ఫౌండేషన్ సేవలు అభినందనీయం



సమావేశంలో కేక్ కట్ చేస్తున్న జిల్లా ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ డాక్టర్ ప్రియాంక

రాజమహేంద్రవరం రూరల్: లెప్రసీ రోగులకు ఏలోహి ఫౌండేషన్ అందిస్తున్న సేవలు అభినందనీయమని జిల్లా ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ డాక్టర్ ప్రియాంక అన్నారు. బొమ్మూరులోని ఎవాంజికల్ లెప్రసీ కాలనీలో ఏలోహి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెట్లా సుమోయోను, ఏసుదాసు వాక్య సందేశం అందించారు. అనంతరం లెప్రసీ రోగులకు భోజనాల ఏర్పాటు చేశారు. వారికి దుస్తులను జిల్లా ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ డాక్టర్ ప్రియాంక చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో గన్నవరం తహసీల్దార్ పల్లవి, కాగితాల శ్రీకాంత్, కొనల శుభకర్, ఆనంద్ పాల్ పాల్గొన్నారు.

కలుపు తీసేద్దాం.. దిగుబడి సాధిద్దాం

- దిగుబడులకు అవరోధం
- వరి మొక్కలకు ఎరువు చేరక నష్టం
- వెదజల్లు విధానంలో కలుపు అధికం
- నివారణ చర్యలతో సత్ఫలితాలు

బిక్కవోలు: ఖరీఫ్ వరినాట్లు అన్నిచోట్లా దాదాపు పూర్తయ్యాయి. ఈ ఏడాది వెదజల్లు విధానంలో నియోజకవర్గంలో 80 శాతం మంది రైతులు సాగు చేపట్టారు. నియోజకవర్గ పరిధిలో అనపర్తి, బిక్కవోలు, పెదపూడి, రంగంపేట మండలాల్లో 50 వేల పైచిలుకు ఎకరాల్లో సాగు జరుగుతోంది. వెదజల్లు విధానంలో దిగుబడులకు అవకాశం ఉన్నా.. కలుపు ఎక్కువగా పెరుగుతుంది. దీనిని అదుపు చేస్తే దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయి. ప్రస్తుత సమయంలో కలుపు నివారణ చర్యలు పాటించడమే శ్రేయస్కరమని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

అనర్థాలివే..

వరిలో సాధారణంగా ఊద, గరిక, తుంగ, అంతర తామర, నక్షత గడ్డి, సర్వసతీ ఆకు తదితర రకాల కలుపు వ్యాపిస్తుంది. కలుపు నివారణ చేపట్టకపోతే ఎకరం పంట సాగులో 12 నుంచి 50 శాతం వరకు దిగుబడి తగ్గే అవకాశం ఉంది. చేలో వేసే ఎరువులను వరి మొక్కకు అందకుండా కలుపు తినేస్తుంది.



పందలపాకలో పొలంలో కలుపు తీస్తున్న కూలీలు

దీంతో పాటు కలుపు వల్ల పొలంలో తెగుళ్లు అధికంగా వ్యాపిస్తాయి. పంట నాణ్యత తగ్గుతుంది. కలుపు ఉన్న పొలంలో ఎరువులు వేస్తే ఎకరాకు 23 కిలోల నత్రజని,14 కిలోల సూపర్ ఫాస్ఫేట్, 23 కిలోల పొటాష్ వృథా అవుతుంది. కొన్ని రకాల కలుపు మొక్కల వల్ల విష పదార్థం భూమిలోకి చేరుతుంది. కలుపు మొక్కలు ఉన్న పొలంలో పనిచేయడం వల్ల రైతులకు చర్మవ్యాధులు, కళ్ల మంటలు వంటి సమస్యలు వచ్చే అవకాశముంది. ఈ మొక్కలను పశువులకు గ్రాసంగా వేస్తే వాటికి కూడా అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదముంది.

నివారణ చర్యలు

డ్రమ్ సీడర్, మెషీన్లతో నాట్లు వేసిన పొలంలో విత్తనాలు వేసిన ఐదు రోజుల్లో ఎకరాకు కలుపు నివారణకు పిత్రిలాక్లోర్, సేఫనర్‌తో కలిపిన 500 మి.లీ మందును పిచికారీ చేయాలి. లేదా బ్యూటాక్లోర్, సేఫనర్‌తో కలిపిన 1250 మి.లీ లేదా అక్సాడయార్జిల్ 35 గ్రాముల పొడి మందును అర లీటరు నీరు, 25 కిలోల పొడి ఇసుకలో కలిపి పొలంలో జల్లుకోవాలి. వెదజల్లు, డ్రమ్ సీడర్ పద్ధతిలో నేరుగా విత్తనాలు జల్లడం వల్ల విత్తనంతో పాటు పొలంలో కలుపు మొక్కలు పెరుగుతాయి. కాబట్టి పై పద్ధతుల్లో నాట్లు వేసిన పొలంలో కలుపు నివారణ చర్యలు సకాలంలో చేపట్టాలి.

20 నుంచి 25 రోజుల్లో..

విత్తిన 20 నుంచి 25 రోజుల్లో ఊద ఎక్కువగా ఉంటే సైహలోఫాప్ బ్యుటైల్ ఎకరాకు 400 మి.లీ మందు పిచికారీ చేయాలి. గడ్డి జాతి మొక్కలు ఎక్కువగా ఉంటే బిస్‌పైరి బ్యాక్ సోడియం 100 మి.లీ, వెడల్పాటి కలుపు మొక్కలు ఉంటే 2,4–డీ సోడియం లవణం 500 గ్రాములను లీటరు నీటికి కలిపి ఎకరాకు 200 లీటర్ల మందు పిచికారీ చేయాలి. కలుపు మరింత ఏపుగా పెరిగిపోతే కూలీలను పెట్టి తొలగించాలి.

ఎరువులు వేయొద్దు



పొలంలో కలుపు ఉండగా ఎట్టి పరిస్థితుల్లో ఎరువులు వేయకూడదు. కలుపు ఉన్నప్పుడు వేసిన ఎరువులను వరి మొక్కల కంటే కలుపు మొక్కలు ఎక్కువగా తీసుకోవడం వల్ల పంటకు నష్టం జరుగుతుంది. రైతులు పెట్టిన పెట్టుబడి వృథా అవుతుంది.

– సామ్యూల్ జాన్, ఏవో, బిక్కవోలు

అవగాహనతో రహదారి ప్రమాదాలు దూరం



అనపర్తి మెయిన్ రోడ్డులో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

పెదపూడి: రహదారులపై ప్రయాణించే వాహన చోదకులు, విద్యార్థులకు రహదారి భద్రతా నియమాలపై తప్పనిసరిగా అవగాహన ఉండాలని అనపర్తి ఎస్సై ఎల్.శ్రీను నాయక్ తెలిపారు. అనపర్తి మెయిన్‌రోడ్డులో రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా వాహన చోదకులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు. హెల్మెట్ ధారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై నాయక్ మాట్లాడుతూ యువకులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. సీట్ బెల్ట్ పెట్టుకోవాలన్నారు. రోడ్లు దాటేటప్పుడు నిబంధనలను పాటించాలని సూచించారు.

ట్యాంకర్‌తో తాగునీటి సరఫరా



ట్యాంకర్ నీటిని పట్టుకుంటున్న గాదరాడ ఇందిరమ్మ కాలనీ వాసులు

మధురపూడి: కోరుకొండ మండలం గాదరాడ ఇందిరమ్మ కాలనీకి గురువారం ట్యాంకర్‌తో తాగునీటిని సరఫరా చేశారు. అక్కడి తాగునీటి సమస్య కారణంగా మహిళలు పడుతున్న ఇబ్బందులను సాక్షి పత్రిక వెలుగులోకి తీసుకువచ్చిన విషయం తెలిసిందే. ఆ వార్తకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించి, ఆయా ప్రాంతాలను పరిశీలించారు. ఈ మేరకు దుర్గానగర్, ఇందిరమ్మ కాలనీల వాసులకు ట్రాక్టర్‌తో తాగునీటిని సరఫరా చేశారు. అక్కడి చెడిపోయిన చేతి పంపులకు మరమ్మతులు నిర్వహించారు. అలాగే సత్యసాయి మంచినీటి పథకం ద్వారా సరఫరా నిలిచిపోవడంతో ఓవర్ హెడ్, జీఎల్ఆర్ ట్యాంకుల ద్వారా సరఫరా చేసేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులతో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ వీవీ గిరి మాట్లాడారు. ఆయన వెంట ఆ శాఖ డీఈ బి.శ్రీనివాస్, ఏఈ ఎంవీ రామకృష్ణ తదితరులు ఉన్నారు.

పాఠశాలకు మైక్‌సెట్ అందజేత



మైక్‌సెట్‌ను అందజేస్తున్న సర్పంచి పెద్దిరెడ్డి సత్యసాయిరాం

బిక్కవోలు: మండలంలోని మెళ్లూరు ఉన్నత పాఠశాలకు దాత మైక్‌సెట్ బహూకరించినట్లు పాఠశాల హెచ్ఎం జి.లక్ష్మి తెలిపారు. రూ.15 వేలు విలువ గల ఈ మైక్‌సెట్‌ను గ్రామ సర్పంచి పెద్దిరెడ్డి సత్యసాయిరాం అందించినట్లు చెప్పారు. పాఠశాల అభివృద్ధికి దాతల సహకారం ఎంతో అవసరం అన్నారు. సర్పంచి సాయిరాం అందించిన మైక్ పాఠశాలలో జరిగే సమావేశాలకు ఉపయుక్తంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ గంగుమళ్ల శ్రీనివాసు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం



కాపవరంలో మాట్లాడుతున్న జడ్జి ప్రకాశ్ బాబు

మధురపూడి: సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ, జడ్జి కె.ప్రకాశ్ బాబు అన్నారు. కోరుకొండ మండలం కాపవరం ఎంపీడీఓ కార్యాలయంలో (విధాన్ సే సమాధాన్) గురువారం మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ భారత సమాజ ప్రగతికి మహిళలే మూలస్తంభాలన్నారు. న్యాయవాది పద్మావతి మాట్లాడుతూ మహిళల సంరక్షణకు అనేక చట్టాలు రూపొందించారన్నారు. వాటి ఆధారంగా మహిళలు హక్కుల సాధనలో ముందుకు సాగాలన్నారు. మరో న్యాయవాది సుజాత మాట్లాడుతూ బాల్య వివాహాల కారణంగా అనార్థాలు జరుగుతున్నాయన్నారు. ఐసీడీఎస్ సీడీపీవో ఝాన్సీరాణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్‌పీడీ విజయకుమారి మాట్లాడుతూ చట్టాలపై మహిళలకు అవగాహన అవసరమన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బత్తిన అశోక్ కుమార్, కోరుకొండ సీఐ సత్యకిషోర్, ఎస్సై శ్యామ్ సుందర్ పాల్గొన్నారు.

జాతిపిత అడుగు జాడల్లో నడవాలి



పెదపూడిలో గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న గంగాధర్ చౌదరి తదితరులు

బిక్కవోలు: జాతిపిత మహాత్మాగాంధీ అడుగు జాడల్లో విద్యార్థులు నడవాలని కొంకుదురు ఉన్నత పాఠశాల హెచ్ఎం మల్లిపూడి శ్రీనివాస్ అన్నారు. గురువారం పాఠశాల ఆవరణలో మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పడాల ఈశ్వరరెడ్డి, మహమ్మద్ వలిషా, సుధాకరరెడ్డి, శిరిషా, చౌదరి తదితరులు పాల్గొన్నారు.

పెదపూడి: జాతిపిత మహాత్మా గాంధీ ఆశయ సాధనకు అంతా కృషి చేయాలని పెదపూడి పీఏసీఎస్ మాజీ చైర్మన్ పుట్టా గంగాధర్ చౌదరి అన్నారు. పెదపూడి మార్కెట్ సెంటర్‌లో గల గాంధీజీ విగ్రహం వద్ద వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. స్వాతంత్ర సముపార్జనలో గాంధీజీ చేసిన పోరాటం అందరికీ స్ఫూర్తి దాయకమన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కలవల కృష్ణమూర్తి, స్థానిక సాగునీటి సంఘం అధ్యక్షుడు కోరా రామన్న చౌదరి, సామాజిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ ఆరుమిల్లి అమ్మన్న చౌదరి, వెంకటసాయి మెడికల్ షాపు నిర్వాహకుడు చందవోలు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజానగరం: మండలంలోని కానవరం, దివాన్ చెరువు విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని 11 కేవీ విద్యుత్ ఫీడర్లపై మరమ్మతులు నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుంది. ఈ విషయాన్ని ఏపీఈపీడీసీఎల్ రాజమహేంద్రవరం రూరల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దాట్ల శ్రీధర్ వర్మ తెలిపారు. కానవరం సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకూ, దివాన్ చెరువు సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ సరఫరా ఉండదన్నారు. ఈ కారణంగా ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలోని కానవరం, చక్రద్వారబంధం, ఫరిజల్లిపేట, రాధేయపాలెం, రాఖీ ఎవెన్యూ, దివాన్ చెరువు, శ్రీరామపురం, పాలచర్లలోని అన్ని రకాల విద్యుత్ కనెక్షన్లకు పైసమయంలో సరఫరా నిలిపివేస్తారన్నారు.

బాబూరావు మృతి వైఎస్సార్ సీపీకి తీరని లోటు



కరకుదురులో బాబూరావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: వైఎస్సార్ సీపీ మండల అధికార ప్రతినిధి, కరకుదురు మాజీ గ్రామ కన్వీనర్ అడపా బాబూరావు (58) అకాల మృతి పార్టీకి తీరనిలోటని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. కరకుదురు గ్రామంలోని తన స్వగృహంలో గురువారం ఆయన అకాల మరణం పొందారు. ఆయన కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ బలోపేతానికి, విజయానికి బాబూరావు విశేష కృషి చేశారన్నారు. మాజీ ఎమ్మెల్యేతో పాటు ఆయన మృతి పట్ల సర్పంచ్ వుంద్రు చంద్రకళ, హితకారిణి సమాజం మాజీ డైరెక్టర్ ఉంద్రు సత్యనారాయణ, పార్టీ గ్రామ కన్వీనర్ పెమ్మనబోయిన గోవిందరాజు, జిల్లా కమిటీ కార్యదర్శి వాసంశెట్టి మాధవ, పాటంశెట్టి త్రిమూర్తులు, ఏలేటి రాజు, అడబాల సత్యనారాయణ, ముప్పిడి సత్యనారాయణ, చిట్టూరి సత్తిబాబు(లిక్కర్ సత్తి), మద్రి భీమరాజు, అడపా జగదీష్, అడపా ఏసు, పి.ఆదినారాయణ తదితరులు సంతాపాన్ని ప్రకటించారు.

అనపర్తి నియోజకవర్గానికి

పదవుల్లో ప్రాధాన్యం



పాలాటి వీరనాగేశ్వరరావు



వల్లభశెట్టి రామసతీష్



పెనుగొండ శ్రీనివాసరావు



కూసుమంచి కృష్ణంరాజు

పెదపూడి: అనపర్తి నియోజకవర్గానికి పదవుల్లో సముచిత స్థానం కల్పించి నలుగురు వైఎస్సార్ సీపీ నాయకులను పార్టీ జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులుగా నియమించినట్లు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఆయన అనపర్తిలో గురువారం మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ పంచాయతీ విభాగం జిల్లా అధ్యక్షుడిగా పాలాటి వీరనాగేశ్వరరావు(రంగంపేట), వాణిజ్యవిభాగం జిల్లా అధ్యక్షుడిగా వల్లభశెట్టి రామసతీష్(దుప్పలపూడి), వర్క్స్ విభాగం జిల్లా అధ్యక్షుడిగా పెనుగొండ శ్రీనివాసరావు(అనపర్తి), కల్చరల్ విభాగం జిల్లా అధ్యక్షుడిగా కూసుమంచి కృష్ణంరాజు(రంగంపేట)లను నియమించినట్లు వెల్లడించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకాలు జరిగాయన్నారు. పార్టీని బలోపేతం చేయడానికి జిల్లా, రాష్ట్ర కమిటీల్లో అనపర్తి నియోజకవర్గానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, రాష్ట్ర శాఖ యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజాలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. తమ నియోజకవర్గం నుంచి త్వరలో మరి కొంత మందికి రాష్ట్ర, జిల్లా కమిటీల్లో పదవులు ఇస్తున్నట్లు తెలిపారు. నూతనంగా పదవులు పొందిన వీరికి పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సబ్బెళ్ల కృష్ణారెడ్డి, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, అనపర్తి, రంగంపేట మండలాల జెడ్పీటీసీ సభ్యులు సత్తి గీతా వరలక్ష్మి, పేపకాయల రాంబాబు, లంక చంద్రన్న, అనపర్తి, రంగంపేట ఎంపీపీలు ఏ.సూర్యనారాయణ, రిమ్మలపూడి శ్రీదేవి, రాష్ట్ర కమిటీ కార్యవర్గ సభ్యుడు కొల్లాటి ఇజ్రాయేలు, అనపర్తి గ్రామ కమిటీ అధ్యక్షుడు ఎస్.మురళీమోహన్ బాలకృష్ణారెడ్డి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ అడబాల వెంకటేశ్వరరావు తదితరులు అభినందనలు తెలిపారు.

కుష్ఠు వ్యాధి నిర్మూలనలో భాగస్వాములు కావాలి



సీతానగరం పీహెచ్‌సీ వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న సిబ్బంది

సీతానగరం: గాంధీ జయంతి సందర్భంగా సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం జాతీయ లెప్రసీ వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. డాక్టర్ ఎన్.రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. డాక్టర్ రాజు మాట్లాడుతూ కుష్ఠువ్యాధి నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. అనంతరం సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో వైఎస్ రాయుడు, సూపర్‌వైజర్లు కె.సుధాకర్, జి.దైవకృప, సీనియర్ అసిస్టెంట్ స్వరూపారాణి, కిరణ్మయి, నందీష్, మున్నీషా పాల్గొన్నారు.

కుష్ఠువ్యాధి నివారణకు కృషి

పెదపూడి: కుష్ఠు వ్యాధి విస్తరించకుండా నివారణకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టి కృషి చేస్తున్నట్లు సంపర పీహెచ్‌సీ వైద్యురాలు శిరీష అన్నారు. పీహెచ్‌సీలో గురువారం ప్రపంచ కుష్ఠు వ్యాధి నిర్మూలన దినోత్సవం సందర్భంగా ప్రజలకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా వైద్యారోగ్య శాఖ ఈ వ్యాధి సోకిన బాధితులకు వైద్య సహాయం అందించడమే కాక ముందస్తు చర్యల్లో భాగంగా సమాజంలో ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పిస్తుందన్నారు. గ్రామాల్లో లెప్రసీ సర్వే ముమ్మరంగా జరుగుతుందన్నారు. వ్యాధిగ్రస్తులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌సీ విజయలక్ష్మి, ఎంపీహెచ్ఎస్‌లు జోగిరాజు, వీరగనిక, ఎల్‌టీ వసంతబాబు, ఏఎన్ఎం ఆదిలక్ష్మి, ఆరోగ్యశాఖ సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు నిర్ణయం హర్షణీయం



దుప్పట్లు పంపిణీ చేసిన గుబ్బల రాంబాబు

రాజమహేంద్రవరం సిటీ: ఇళ్లల్లో పనిచేసే పనివారి భద్రత, వారిని శ్రామికులుగా గుర్తించాలన్న సుప్రీంకోర్టు నిర్ణయం హర్షణీయమని స్వర్ణాంధ్ర సంస్థ నిర్వాహకుడు డాక్టర్ గుబ్బల రాంబాబు అన్నారు. నగరంలోని స్వర్ణాంధ్ర సంస్థ ప్రాంగణంలో గురువారం ఇంటి పనివారితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు, పేదరికం కారణంగా అనేక మంది మహిళలు ఇంటిపనివారుగా మారుతున్నారన్నారు. వారికి కనీస హక్కులు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారికి పనిచేసే చోట భద్రత, కనీస హక్కులు కల్పించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఇంటిపనివారి జీవితంలో మార్పునిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గత ఐదేళ్లుగా ఇంటిపనివారితో సమావేశాలు ఏర్పాటు చేసి, వారికి పనిపై అవగాహన కల్పించడం, యజమానులతో సత్సంబంధాలు, నమ్మకం పోగు చేసుకోవడం, ఆరోగ్య సమస్యల మీద అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా నగరంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 125 మంది ఇంటి పనివార్లకు రూ.వంద చొప్పున నగదు, దుప్పట్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్వర్ణాంధ్ర మేనేజర్ హరికృష్ణ, మీరా కుమారి, గంగాధర్, ధనలక్ష్మి, కొండలరావు, దివ్య, ప్రసాద్, శేఖర్ పాల్గొన్నారు.

మందుల షాపుల పరిశీలన



చినకొండేపూడి మెడికల్ షాపును పరిశీలిస్తున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కల్యాణి

సీతానగరం: మండలంలోని మందుల షాపుల రికార్డులను డ్రగ్ ఇన్స్‌స్పెక్టర్ పి.కళ్యాణి గురువారం పరిశీలించారు. చినకొండేపూడిలో మూడు, మునికూడలిలో ఒక షాపును తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ చినకొండేపూడిలోని రెండు షాపుల్లో ఫార్మసిస్టులు ఉన్నారని, ఒక షాపులో లేరన్నారు. మునికూడలిలో ఫార్మసిస్ట్ లేరన్నారు. వీటిపై కేసులు నమోదు చేస్తామన్నారు. షాపుల్లో రికార్డులు పరిశీలించగా కొనుగోలు బిల్లులు ఉన్నాయని, అమ్మకం బిల్లులు అతి తక్కువగా ఉండటంతో మందులు స్టాక్ సరిపోవడం లేదన్నారు. ఆర్ఎంపీ చీటీలపై మందులు అమ్ముతున్నారని, అవి చెల్లుబాటు కావన్నారు. క్వాలిఫైడ్ డాక్టర్ల చీటీలు మాత్రమే చెల్లుబాటు అవుతాయన్నారు. ఆర్ఎంపీ చీటీలపై హైయర్ యాంటీబయాటిక్స్ ఇవ్వరాదన్నారు.

ముగిసిన పశువైద్య శిబిరాలు



నాగంపల్లి శిబిరంలో గేదెకు వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ ఫణీంద్ర

సీతానగరం: పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మండలంలో నిర్వహిస్తున్న వైద్యశిబిరాలు ముగిశాయని మండల పశువైద్యాధికారి డాక్టర్ ఎ.ఫణీంద్ర తెలిపారు. నాగంపల్లిలో గురువారం నిర్వహించిన శిబిరంలో చీపురుపల్లి, నాగంపల్లికి చెందిన 54 మంది పాడి రైతులకు చెందిన 92 పశువులు, 450 మేకలు, గొర్రెల(జీవాలు)కు వైద్య సేవలు అందించారు. అనంతరం పాడి రైతులకు మందులు ఉచితంగా పంపిణీ చేశారు. డాక్టర్ ఫణీంద్ర మాట్లాడుతూ మండలంలో పది వైద్యశిబిరాలు నిర్వహించామని, వాటిని పాడి రైతులు చక్కగా వినియోగించుకున్నారన్నారు. కార్యక్రమంలో హెచ్ఏలు వెంకటేశ్వర్లు, షేక్ యామిని, సుధాకర్, గీతిక, చిట్టిబాబు, పాడి రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్నింటా ప్రతిభ చూపాలి



విద్యార్థినికి జ్ఞాపిక ప్రదానం చేస్తున్న సీఐ గణేష్

ధవళేశ్వరం: విద్యార్థులు చదువుతో పాటు అన్నింటా ప్రతిభ చూపాలని సీఐ టి.గణేష్ అన్నారు. ధవళేశ్వరంలోని జోషి డ్యాన్స్ అకాడమీ సిల్వర్ జూబ్లీ ఉత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రాధాన్యతను ఇవ్వాలని తల్లిదండ్రులకు సూచించారు. ఇటీవల జాతీయ స్థాయిలో ప్రతిభ చూపిన అకాడమీ విద్యార్థులకు సీఐ టి.గణేష్, డ్రీమ్స్ స్కూల్స్ చైర్మన్ ఎ.రమేష్, జై ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ సీఈవో వర్రే రమేష్, సినిమా, టీవీ కొరియోగ్రాఫర్ ఎల్.నాని గోపాల్, ఆర్‌డీడీ యూనియన్ ప్రెసిడెంట్ సతీష్ , కొరియోగ్రాఫర్ అభిరామ్ తదితరులు బహుమతులను ప్రదానం చేశారు.